

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 18 జూలై, 2021 సంచిక : 2

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**
**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**
**ప్రధాన సంపాదకత్వం :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ**
**ప్రత్యేక సహకారం :**
**డా॥ జి.చంద్రారెడ్డి** M.A, M.Ed., Ph.D
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**
**శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)**
**ప్రచార సారథ్యం :**
**శ్రీ ఎం. సత్యనారాయణ** M.Tech.
**శ్రీ బి. గోపీకృష్ణ**
**శ్రీమతి బులుసు జయ**

**సాయివాణి చందా వివరాలు**
ద్వైవార్షిక చందా. .......... రూ॥ 200/-
ఆజీవ సభ్యత్వం .......... రూ॥1000/-

**చిరునామా :-**
**సాయివాణి**
**సాయిధామం, బొమ్మల రామవరం మండలం,**
**యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.**
**Ph : 9440413455, 9848133565**

**Online Donations :**
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code : SBIN 0020639**

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి .......... 2
అవి వదులుకుంటేనే ఆత్మ .......... 6
మీ ప్రయత్నం మానవద్దు .......... 11
సాయి సేవక్-శ్రీ శివనేశన్ .......... 14
ధన్యజీవి స్వర్గీయ శ్రీ మండువ 18
గురు పూర్ణోత్సవం .......... 20
శాశ్వత ధర్మగోప్త .......... 21
సాయిభక్త దాసగణు .......... 24
బాలవాణి .......... 27
న శ్రేయో నియమం వినా.......... 32


(ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.)







## మా వాణి



ప్రియ సాయీ భక్తులందరికీ గురుపూర్ణిమ శుభాకాంక్షలు. దత్తాత్రేయ స్వామి గురు పరంపరకు ఆద్యుడు. ఆ స్వామి పరిపూర్ణ అవతారమే శ్రీ సాయి. కాబట్టి సాయి భక్తులకు గురుపూర్ణిమ అత్యంత ప్రధానమైన పర్వ దినం. ఆ రోజున గురుపూజ చేసుకోవాలని అలనాడే సాయినాథుల వారు తన చుట్టూ ఉన్న భక్తులకు సూచించారు. "ఇవ్వేళ ఆషాఢ శుద్ధ పూర్ణిమ- గురుపూర్ణిమరా- ఈ స్తంభాన్ని పూజించుకోండి" అన్నారు. "మా గురువు సజీవంగా మా కళ్ల ఎదుట ఉండగా కొయ్య స్తంభాలు పూజించవలసిన ఖర్మ ఏమిటి మాకు?" అంటూ శిష్యులు స్వయంగా సాయిబాబా వారినే పూజించారు. ఆనాటి నుండి గురుపూర్ణిమోత్సవం ఒక ఆచారంగా మారింది షిరిడీలో.

గృహస్థులైన శిష్యులు అనునిత్యం ఎన్నో సమస్యలలో కొట్టుమిట్టాడు తుంటారు. రోగాలు, అధిక బాధలు, ఆర్థిక సమస్యలు, భార్యాపుత్రుల పోషణ, వృత్తి ఉద్యోగ బాధలు- యిలా ఎన్నో సమస్యలు. అవిగాక క్షణక్షణం నరులను మోసగించే మాయామోహిని - 'మమకారం' దాని సైదోడు భూతం 'అహంకారం'. అవి మరింతగా మనుష్యులను బాధిస్తుంటాయి. ఇంట్లో తగవులు, చికాకులకన్నా మనిషిని గోతిలో ముంచేవి ప్రేమ పేరిటి మమకారం, పెరిగే కీర్తి, వృత్తి, ఉద్యోగాలలో ఉన్నతి, ధనప్రాప్తి వంటి వాని వలన కలిగే అహంకారాలేనని విజ్ఞులు చెప్తుంటారు. కాస్త ఆలోచిస్తే మన అనుభవం కూడా అదేనని తెలుస్తుంది. అందుకే "సూది బెజ్జంలో ఒంటె దూరటం కన్నా ధనవంతుడు దైవరాజ్యం చేరటం కష్టం" అన్న సూక్తి

సత్యమేనని చెప్తాడు. ఇక్కడ ధనవంతుడు అంటే 'అన్ని విధాలా లౌకిక ఫలాలు అనుభవిస్తున్నవాడు' అని అర్థం చేసుకోవాలి.

మరి - యీ మాయావాహినిలో పడి సుడులు తిరుగుతున్న వారికి కూడా - వారి వారి పూర్వజన్మ సుకృతాన్ని బట్టి దైవచింతన, ఆధ్యాత్మిక చేతన, గురుచరణ సాన్నిధ్యప్రాప్తి వంటివి కలుగుతాయి. గత సుకృతం అలాంటి మహద్భాగ్యాన్నిచ్చినా-యిహ జన్మకర్మల వలన కలిగే అహమో మరేదో వాటి నుంచి దూరానికి లాగుతుంది. అందుచేత -

శిష్యులైన ప్రతివారు కూడా-తామెలాంటి పరిస్థితులలో ఉన్నా, ఎంత దూరాలలో ఉన్నా ఎంత "బిజీ" జీవితాల్లో ఉన్నా-గురుపూర్ణిమ నాడు మాత్రం గురుపాద దర్శనం చేసుకొని తీరాలి. ఆ గురువు గతంలో చేసిన బోధల సారాన్ని గుర్తు చేసుకోవాలి. తన దోషాలు మన్నించమని గురు చరణాలపై తల ఉంచి వేడుకోవాలి. ఆ గురువు ఏ ధ్యేయనిష్ఠతో ముందుకు సాగిపోతున్నారో మరోసారి మననం చేసుకోవాలి. గురు సోదరులు (సాటి శిష్యులు) ఏ విధంగా సాధన చేస్తున్నారో, ఎలా జీవిస్తున్నారో తెలుసుకోవాలి. తన కన్నా పతనావస్థలో ఉన్న వారి పట్ల సానుభూతితో వ్యవహరించాలి. వారి దోషం తెలియజెప్పే ప్రయత్నం చేయాలి. తనకన్నా ఉన్నత స్థితిలో ఉన్న వారిని చూచి సంతోషించాలి. ఎందుకో తెలుసా? తన శిష్యులు సన్మార్గంలో (సాధన మార్గంలో) ఉంటే గురువుకు ఆనందం కలుగుతుంది. తన గురువుకు ఆనందం కలిగించిన వాటి పట్ల తనకు కూడా అభిమానం ఏర్పడుతుంది. (అలా ఏర్పడకపోతే మనం మత్సరగ్రస్తులమైపోయామనీ, మన శిష్యరికంలో వక్రత, బలహీనత ఉన్నాయని అర్థం). ఆ ఉన్నతస్థితిలో ఉన్న వారి స్థాయికి తానూ ఎదగాలన్న స్థిర నిర్ణయం చేసుకోవాలి. గురుసన్నిధిని కొద్ది నిముషాలైనా ధ్యానం చేసుకొని అనుభూతి పొందాలి. చేతనైన దక్షిణతో పాటు గురువుగారికి





భక్తిపూర్వకమైన నమస్కారం చేయాలి. దక్షిణ మనలోని త్యాగబుద్ధిని సూచిస్తుందని శాస్త్ర వాక్కు. అంచేత 'దక్షిణ లేని నమస్కారం వ్యర్థం' అన్నారు పెద్దలు. అంటే త్యాగబుద్ధి లేని నమస్కారాలు మన నడుం పట్టుకుపోవడానికీ, గురువు పాదాలు వాచిపోవడానికీ తప్ప మరెందుకూ పనికి రావని తాత్పర్యం.

ఇలా ఏడాదికొక్కసారైనా గురుదర్శనంతో-మనలో వెనుదిరిగిపోతున్న సత్యస్రవంతిని తిరిగి మార్గంలోకి మళ్ళించుకోవటం అన్నదే గురుపూర్ణిమ యొక్క పరమప్రయోజనం. శ్రీరామకృష్ణ పరమహంస, "గృహస్థు కనీసం నెలకొక్క రోజైనా యింటికీ, మామూలు జీవనానికీ దూరంగా, తనసెవరూ గుర్తుపట్టని చోట-దైవచింతనతో గడపా"లని చెప్పారు. మనసెరిగిన వారున్నచోట మన సహజ ఆవరణలు (మనను కప్పిన అనేక సంస్కారాల పొరలు) తొలగిపోవటం కష్టం. 'ఐడెంటిటీ' గుర్తింపు అన్నది లేనిచోట-మనలోని సహజత్వం త్వరగా వికసిస్తుంది. నిర్మలత్వం ఆవరిస్తుంది. అంచేత మనలోని మంచిచెడులను తేలికగా వింగడించుకొని, విశ్లేషించుకొని, తరించుకొని చూచుకోగలుగుతాం. ఆ 'ఆత్మశోధన' కనీసం నెలకోసారైనా జరగాలంటే-అలా నిత్యజీవన విధానానికి ఒక రోజు సెలవు పెట్టి బయటపడాలని' పరమహంస చెప్పారు. అలాకూడా చేయలేకపోతున్నది నవసమాజం. తన పాశాలు తానే అల్లుకొని, తన చుట్టూ బిగించుకొంటున్నది. అంచేత -

కనీసం గురుపూర్ణిమ వంటి పర్వదినాలలోనైనా యిలాంటి క్షాళన కార్యక్రమం జరిగితే మంచిది. కనుక ఆ రోజుకు తమ యితర కార్యక్రమాలన్నీ ప్రక్కకుపెట్టి-అంతే కాదు-ఆ రోజంతా అంతర్యంలోనూ, బాహిరంగంగానూ కూడా గురుస్మరణతోనూ, సేవతోనే గడపాలి. సహశిష్యులతో కలిసినపుడు కూడా కేవలం ఆధ్యాత్మిక చర్చలు (యోగ క్షేమ

విచారణ కొద్దిపాటిగా జరపవచ్చు) మాత్రమే జరపాలి. క్షణ క్షణమూ ఎలా సద్వినియోగం చేసుకోవాలన్న తపన మనలో రగలాలి తప్ప - "అందరూ కలిసారు గదా! కాస్సేపు కబుర్లాడదాం" అన్న సామాన్య కాంక్షకు లోను కాకూడదు.

**"అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా!**
**దక్షురు న్మీలితం యేన తస్మై శ్రీ గురవే నమః ॥**

మన యీ మామూలు అజ్ఞతలనే చీకట్లన్నీ కలిసి మన కళ్లను కమ్ముకొని అత్యుత్తమమైన దైవదీప్తిని చూడనివ్వని గ్రుడ్డితనాన్ని ప్రసాదిస్తాయి. జ్ఞానమనే అంజనం పూసిన పుల్లతో ఆ కళ్లు తెరిపించి వెలుగునిచ్చేది గురుదేవులు. అట్టి గురువుకు నమస్కరించుకోవడానికి కూడా ఏదో అడ్డుపడుతుంటే ఎలా?

ఇంతకీ నమస్కరించడమంటే ఏమిటి? చేతులు జోడించడమా? వంగి నమస్కరించడమా? సాష్టాంగపడి పాదాలంటి నమస్కరించడమా? ఆత్మార్పణ చేసుకోవడమా? ఎలా నమస్కరించటం అన్నది మన స్థాయినిబట్టి, మన గురువు పట్ల మనకుండే స్వచ్ఛమైన ప్రేమనుబట్టి నిర్ణయించుకోవాలి. ఆత్మార్పణ చేసుకోవాలనుకున్న తరువాత "అంటే ఏమిటి" అని ఆలోచించటం కంటే - ముందుగానే నిర్ణయించుకొని తరువాత నమస్కరించటం-అటుపైన మార్గం తప్పకుండా ఉండడం మంచిది. అటువంటి సచ్ఛిష్యులుగా మనందరినీ తీర్చిదిద్దమని శ్రీ సమర్థ సద్గురు సాయినాథుల వారిని వేడుకొందాం.







# ... అవి వదులుకుంటేనే ఆత్మజ్ఞానం!

భగవాన్ షిరిడీ సాయిబాబా మాహాత్మ్యాన్ని ఆ నోటా, ఈ నోటా విన్న ఓ వ్యాపారి ఒకానొక రోజు వారిని దర్శించుకోవడానికి వెళ్ళాడు. సిరి సంపదలకు లోటులేని ఆ శ్రీమంతుడు బాబా పాదాలకు సాష్టాంగ ప్రణామం చేసి 'బాబా! ఇక్కడకు వచ్చిన వారి కోర్కెలన్నీ మీరు తీరుస్తారట కదా! నాకు అన్నీ ఉన్నాయి; ధనానికీ, పొలాలకూ, తోటలకూ, ఇళ్ళకూ లోటు లేదు. కానీ, ఆత్మజ్ఞానమే కొరవడింది. ఆ జ్ఞానాన్ని నాకు త్వరగా ప్రసాదిస్తే చాలా సంతోషిస్తాను' అన్నాడు. అప్పుడు బాబా 'అష్టైశ్వర్యాలు కాకుండా, ఆత్మజ్ఞానాన్ని కోరుకున్నావు. చాలామంచిది; దాన్ని తప్పకుండా నీకు ప్రసాదిస్తాను' అంటూ పక్కన కూర్చోబెట్టుకున్నారు. తరువాత ఏదో మాటల్లో పడ్డారు.

కొన్ని క్షణాలకు బాబా దూరంగా ఉన్న ఓ బాలుడిని పిలిచి 'మార్వాడీ వద్దకు పోయి నేనడిగానని చెప్పి ఓ అయిదు రూపాయలు చేబదులు తెమ్మని పంపారు. కుర్రవాడు వెళ్ళి, వెంటనే తిరిగి వచ్చి, 'మార్వాడీ ఇంటికి తాళం వేసి ఉందని చెప్పాడు. అప్ప కోసం మరో ఇద్దరు, ముగ్గురి ఇంటికి కూడా పంపి చూశారు బాబా. కానీ, ఎక్కడా అయిదు రూపాయలు పుట్టలేదు. ఆత్మజ్ఞానం కోసం వచ్చిన ఆ వ్యాపారి అక్కడే ఉన్నాడు; అతని జేబులో నోట్ల కట్టలు ఉన్నాయి. బాబా అయిదు రూపాయల కోసం పడుతున్న యిబ్బంది చూస్తూ ఉన్నాడే కానీ జేబులో నుంచి ఒక్క నోటు కూడా తీయడం లేదు. పైగా, తనకు ఆత్మజ్ఞానం ఇవ్వడానికి ఆలస్యమవుతోందంటూ తొందరపడసాగాడు.

అప్పుడు బాబా నవ్వుతూ 'నాయనా! నీకు ఇంకా అర్థం కావడం లేదా? నాపై నమ్మకం లేక అయిదు రూపాయలు తీసి ఇవ్వడానికే నువ్వు ఇంత ఆలోచిస్తున్నావు. ఇలాంటి నిన్ను నమ్మి ఆత్మజ్ఞానాన్ని ప్రదానం చేయమని

అడుగుతున్నావే! వ్యామోహాలు వదులుకోనిదే ఆ అపురూపమైన జ్ఞానం ఎలా వస్తుందనుకున్నావు?' అని ప్రశ్నించారు. ఈ ఆత్మజ్ఞాన రహస్యాన్ని ఆదిశంకరుల ప్రియశిష్యులు భారతీవంశ కూడా 'భజగోవిందం'లో ప్రబోధిస్తూ ....

**కామం క్రోధం లోభం మోహం త్యక్త్వాత్మానం పశ్యతి సోహం।**

**ఆత్మజ్ఞాన విహీనా మూఢాః తే పచ్యన్తే నరక నిగూఢాః ॥**

'కామ క్రోధ లోభ మోహాల్ని వదిలినవాడే ఆత్మను తెలుసుకోగలడు. ఆత్మజ్ఞానం లేని మూర్ఖులు నరకబాధల్ని అనుభవిస్తారు' అని విస్పష్టం చేస్తారు.

**అరిషడ్వర్గాలే అడ్డంకులు :** బాబా చెప్పినా, 'భజగోవిందం' చెప్పినా ఒక్కటే! ఈ ఇహలోక విషయ వాసనలపై విసుగు చెందనంత కాలం పారమార్థికత వైపునకు మనస్సు మరలదు. ముందు ఈ ప్రాపంచిక వాసనలను వదులుకుంటేనే ఆత్మజ్ఞానానికి అర్హత లభిస్తుంది. అందుకే ముందు కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే అరిషడ్వర్గాలను అదుపులో పెట్టుకోవాలి.

అలా ఆ ఆరింటినీ కట్టడి చేయకుండా, ఒక్కో గుణానికి ఒక్కరు ప్రతినిధులుగా చరిత్రలో హీనులుగా మిగిలిపోయిన వారు ఎందరో! 'కామం' వల్ల రావణుడు నేలకూలాడు; 'క్రోధం' వల్ల దుర్వాసుడు పాడయ్యాడు; 'లోభం' వల్ల హిరాణ్యాక్షుడు నాశనమయ్యాడు; 'మోహం' వల్ల భస్మాసురుడు భస్మమయ్యాడు; 'మదం' వల్ల హిరణ్యకశిపుడు మట్టి కరిచాడు; 'మాత్సర్యం' వలన దుర్యోధనుడు మరణించాడు. ఆయా గుణాలు మనలో వేళ్లూనుకొని వటవృక్షాలుగా ఎదుగుతున్నప్పుడల్లా, వీళ్లను గుర్తు చేసుకుంటూ, వాటిని పెరికివేస్తూ ఉండాలి. ఈ దుర్గుణాలు ఆత్మజ్ఞానాని కన్నా ముందు మనిషిలోని ఆనందానికీ అడ్డంకిగా నిలుస్తాయి. కామం, మోహం, మాదకద్రవ్యాలలాంటివి. ముందు ఆహ్లాదంగా అనిపిస్తాయి; తరువాత మనిషిని అగాధంలోకి నెట్టేస్తాయి. అందుకే భగవాన్ శ్రీరామకృష్ణ





పరమహంస 'కామినీ కాంచనాల ఆసక్తి ఉన్నంత వరకు దేహబుద్ధి నశించదు. విషయాసక్తత తగ్గినంత మేరకు ఆత్మజ్ఞానం కేసి పురోగమించ వచ్చు; దేహబుద్ధీ తగ్గుతుంది. విషయాసక్తి అడుగంటా నశిస్తేనే ఆత్మజ్ఞానం కలుగుతుంది. అప్పుడు ఆత్మ వేరు, దేహం వేరు అని బోధపడుతుంది. కొబ్బరికాయలో నీరు ఇంకిపోనంత వరకు దానిలోని కొబ్బరినీ, చిప్పనూ కత్తితో కూడా వేరు చేయడం కష్టం. నీరు ఇంకిపోతే లోపల ఎండు కొబ్బరి దబదబలాడుతుంది, చిప్ప నుంచి కొబ్బరి వేరైపోతుంది" అంటారు.

దారి తప్పించేవి దేహవాంఛలే! : ఆత్మకు సంబంధించిన జ్ఞానాన్ని అర్జించాలంటే ముందు దేహవాంఛలను తగ్గించుకుంటూ ఉండాలి. దీర్ఘంగా ఆలోచిస్తే మనకు వచ్చే కష్టాలన్నీ కూడా ఈ తనువుకు సంబంధించిన తపనల వల్లేనని అర్థమవుతుంది. శరీరం మాటున సాక్షిలా వీక్షిస్తున్న ఆత్మను ఆ వాంఛలు మాయతెరల్లా కమ్మేస్తున్నాయని స్పష్టమవుతుంది. శరీరం కోరే గొంతెమ్మ కోర్కెలన్నీ తీర్చుకుంటూ, అలసిసొలసి, ఆత్మజ్ఞానానికి మార్గాన్ని చూపే ఆ భగవంతుడినే మరచిపోతున్నాం. అశాశ్వతమైన శరీరాన్ని సంతృప్తిపరచడం అసాధ్యమనీ, శాశ్వతమైన ఆత్మానందాన్ని పొందడమే లక్ష్యమనీ తెలుసుకోలేకపోతున్నాం. ఎంతెంత కాలాన్ని, ఎన్నెన్ని ధనరాసుల్ని ఈ శరీరం కోసం వెచ్చించామో ఆలోచిస్తే మతి పోతుంది. అందులో ఏ కాస్తయినా పరోపకారంవైపు, పారమార్థికత వైపు మళ్లిస్తూ ఉంటే మనలోని భగవంతుడు మనకు దర్శనమిస్తాడు; ప్రాపంచిక సమస్యల నుంచి ఆదుకుంటాడు. అందుకే భగవాన్ రమణ మహర్షి 'మనం కేవలం దేహానికి పరిమితులమన్న తప్పుడు నమ్మకమే మన సమస్యలకు మూలం. నిరంతర ఆత్మ పరిశీలన వల్ల మనకు నిజమైన జ్ఞానం కలుగుతుంది. మన స్వస్వరూపం తెలుస్తుంది. ఆ అసలు స్వరూపం మనలోని ఆత్మే' అంటారు.

**క్రోధమూ క్రూరమే ....:** ఈ రోజుల్లో మనిషిని మరింత మూర్ఖుణ్ణి చేసే

దుర్గుణాల్లో క్రోధమూ ఒకటి.

**కోరికలే కొబ్బరి నీళ్ళు, కొబ్బరే ఆత్మ, కొబ్బరి పెంకే శరీరం. నీరు ఇంకిపోనంత వరకూ పెంకు మంచి కొబ్బరి వేరు కానట్లే, కోరికలపై ఆసక్తి పోనంత వరకు దేహానికీ, ఆత్మకూ మధ్య భేదం తొలగదు.**

అలవిమాలిన ఆగ్రహం మనిషిని క్రూరజంతువుగా మార్చేస్తుంది. ఆధునిక జీవనంలో మనిషి అసహనానికి లోనై. ఆగ్రహావేశాల పాలై తన సహజప్రవృత్తినే విస్మరిస్తున్నాడు. నోటి దురుసుతో తనకు తానే శత్రువులను పెంచుకుంటున్నాడు. ముక్కు మీద కోపంతో మసలుకునేవాణ్ణి లోకం మృగంలా భావించి పక్కకు తప్పకుంటుందే కానీ, మక్కువతో దగ్గరకు తీసుకోదు. చివరకు ఆత్మీయులు కూడా ఆమడ దూరంలో ఉంటారు. అందుకే హనుమంతుడు 'సుందరకాండ'లో ...

**ధన్యాస్తే పురుష శ్రేష్ఠాః యే బుద్ధ్యా కోపముత్థితమ్**

**నిరుంధతి మహాత్మానః దీప్తమగ్ని మివాంభసా।**

అంటూ మహాత్ములైన ధీరపురుషులు తమలో పెల్లుబుకిన ఆగ్రహావేశాలనూ, పైకి ఎగిసిపడుతున్న మంటనూ నీటితో చల్లార్చినట్లు నిశ్చయాత్మక బుద్ధితో నిగ్రహించుకుంటారు; నిజంగా వారు ధన్యాత్ములని శ్లాఘిస్తాడు. ఇలా సంయమనంతో మెలిగే వారి మనస్సు స్ఫటికంలా తేటగా ఉంటుంది. ఆత్మ ప్రకాశవంతంగా ప్రకటితమవుతుంది.

**నరకం మరెక్కడో లేదు :** ఆత్మజ్ఞాన రహితుడై జీవించే మూర్ఖుడు నరక బాధల్ని అనుభవిస్తాడని 'భజ గోవిందం' హెచ్చరిస్తోంది. నిజానికి నరకం ఎక్కడో ఆ పై లోకంలో లేదు. అంధకూపం, కుంభీపాకం లాంటి అన్ని రకాల నరకబాధలను అనుభవింపజేసే పాపపరిహార ప్రాంగణం ఈ భూలోకమే. కోర్కెల పరంపర ఫలితంగా అవి తీరే అవకాశమున్న ఉపాధుల లోకి ఆత్మ ప్రవేశించాల్సి ఉంటుంది. అంటే మనోవాంఛలకు అనుగుణంగా





దేహాలను ధరించాల్సి ఉంటుంది. అప్పుడు ఆయా శరీరాలకు సంబంధించిన సుఖదుఃఖాలను జీవుడు అనుభవించక తప్పదు. అలా కర్మలు, వాసనలు, వాంఛల ఫలంగా లభించిన శరీరాలతో గరుడ పురాణంలో చెప్పిన ఎనభై నాలుగు లక్షల నరక బాధలను భరించాల్సి ఉంటుంది. కుక్కలా పుడితే కర్రదెబ్బలు తినాల్సి ఉంటుంది; కోళ్లు, మేకల్లా పుడితే పసందైన వంటల కోసం కోతలకు గురికావలసి ఉంటుంది. ఇలా సృష్టిలో ఏ జీవిగా పుట్టినా నానారకాల నరకబాధలకు గురి కావలసిందే! అలాంటి నరకబాధలు తప్పించుకోవాలంటే మానవజన్మ ఎత్తినప్పడే పుణ్యకార్యాలు చేసుకోవాలి. కొత్త పాపాలకు అవకాశం లేకుండా, పాపభారాన్ని క్షయం చేసుకోవాలి. అలా కాకుండా స్వార్థంతో, లోభంతో బతికితే మన కష్టాల్ని మనం కొనితెచ్చుకున్నట్లే. అందుకే శ్రీమద్భాగవతం ....

**ధనవంతుండగు మానవుడు కడగన్ ధర్మోపకార్యంబులన్**

**ఘనతం చేయక యుండెనేని యమలోకంబందు సూచీముఖం**

**బను నా దుర్గతి బట్టి త్రోచి నిధిగా పైయున్న భూతంబటం**

**చును పాశంబుల పట్టి కట్టి వడిలో నొప్పింతు రత్యుగ్రులై**

అంటూ, ధర్మకార్యాలు చేయకుండా ఇతరులకు ఏమాత్రం ఉపకారం చేయకుండా ధనం కూడబెట్టడమే తమ ధ్యేయంగా భావించినవాడు చనిపోతే వాణ్ణి యమభటులు 'సూచీముఖ'మనే నరకంలో పడదోస్తారు. అక్కడ భయంకరమైన యమకింకరులు 'డబ్బుకు కాపలా ఉన్న దెయ్యమా' అంటూ వాణ్ణి పట్టి, తాళ్ళతో బంధించి నానా బాధలు పెడతారని హెచ్చరించింది. దీపం ఉన్నప్పడే ఇల్లు చక్కదిద్దుకున్నట్లు, మానవ రూపంలో ఉన్నప్పడే ఆ ఆరుగురు శత్రువులనూ గెలిచి, భగవంతుడి వైపు జీవుడు దృష్టి మరలిస్తే ఆనందం, ఆత్మజ్ఞానం ఆయనే ప్రసాదిస్తాడు.

# మీ ప్రయత్నం మానవద్దు

మనలోని ప్రతి ఒక్కరికీ భౌతికమైన, మానసికమైన ప్రతిఘటనలు ఎదురవుతాయి. సాధన ద్వారా వీటిని తట్టుకుని నిలబడే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి. చాలామంది తట్టుకోలేక భగ్నహృదయాలతో, తాత్కాలికంగా మానసికమైన అస్థిరత్వంలోకి జారిపోతారు. ఆధ్యాత్మిక సాధన మొదలుపెట్టక ముందు వారికి తాము మరింత మెరుగ్గా ఉన్నట్లు తోస్తుంది. మన చైతన్యాన్ని ఉన్నతమైన స్థాయికి లేవనెత్తాలంటే, అస్థిరత్వంతో నిండిన కొన్ని దశల గుండా పయనించక తప్పదు. ప్రాపంచికమైన జీవితం గడిపేటప్పుడు, పారమార్థిక వికారపు దశల పట్ల తగిన అవగాహన ఉండదు. ఆధ్యాత్మిక జీవితంలోకి అడుగుపెట్టి, సాధనను నిజాయితీగా చేయడం మొదలుపెట్టినప్పుడు అది అచేతనావస్థలోని నాడీ ప్రవాహాలలో అలజడి రేపి, మనల్ని అస్థిరత్వంలోకి దింపుతుంది. ఒక్కొక్కసారి మానసికంగా, నిస్సత్తువగా అనిపించవచ్చు. కొందరిలో మానసికమైన అశాంతి, డోలాయమానస్థితి, నైతికమైన అస్థిరత ఏర్పడి, అవి చాలాకాలం కొనసాగవచ్చు.

ఇటువంటి పరిస్థితులు ఎదురైనప్పుడు చాలామంది ఆధ్యాత్మిక సాధనను వదలిపెట్టేస్తారు. నిజానికి చేయవలసింది దానికి వ్యతిరేకం. అంటే సాధనను తీవ్రతరం చేయాలి. లేకపోతే పతనం తప్పదు, ఆధ్యాత్మికతలో ఎప్పటికీ ముందుకు సాగలేము. పతనం నుంచి తిరిగి కోలుకోవడానికి కూడా చాలాకాలం పట్టవచ్చు. అందువలన ఆధ్యాత్మిక సాధనను ఆ పరిస్థితులలో మానకూడదు. మరింత గట్టిగా, పట్టువిడవకుండా, కార్యసాధన దిశగా కొనసాగించాలి. మౌనంగా, స్థిరంగా, ఏకాగ్రతతో, పట్టుదలతో, ఎటువంటి కల్లోలాలనూ దరిజేరనీయకుండా జపధ్యానాలను చేయాలి. తప్పనిసరిగా నైతిక జీవనాన్ని సాగించాలి లేని ఎడల ఆధ్యాత్మిక జీవనం నుంచి ఏదో ఒక రోజున జారిపోవడం తథ్యం. ఆధ్యాత్మిక గమ్యాన్ని వారు చేరుకోవడం కలలోని వార్త.





'యమ' 'నియమ' నిబంధనలను నిష్ఠగా పాటించనివారు ఏమీ సాధించలేరు. ఆధ్యాత్మిక జీవనం వలన అన్ని వైపుల నుంచీ వచ్చే ఒత్తిడిని వారు తట్టుకోలేరు. కాబట్టి ఏ సాధకుడైనా యథేచ్ఛా విహారాలు చేస్తూ, భౌతికంగా లేదా మానసికంగా తన శక్తినీ వృధా చేసుకోరాదు. పూర్వపు ఆచార్యులకు ఈ విషయం బాగా తెలుసు. అందువలనే 'యమ', 'నియమ' నిబంధనలను తు.చ. తప్పకుండా పాటిస్తూ, అలసత్వానికి తావులేని నీతి మంతమైన జీవితాన్ని గడపాలని ఆంక్షలు విధించారు. నీతి నియమాలను పాటించకుండా తీవ్రమైన భావోద్వేగాలతో సాధన చేస్తే చివరకు నాడీ వ్యవస్థ భగ్నం అవుతుంది. మన శక్తులు మరింత బలహీనమై చివరకు ఇంద్రియాలకు బానిసలుగా మారడం ఖాయం. వీటిని ఉబుసుపోక చెప్పే సిద్ధాంతాలుగా ఏమాత్రం భావించవద్దు. మేము కూడా ఆధ్యాత్మిక జీవనపు ప్రారంభంలో ఈ సమస్యలు ఎదుర్కొన్నాము. మాకు ఆధ్యాత్మ విద్య నేర్పిన ఆచార్యులు కూడా వీటిని ఏమాత్రం విస్మరించవద్దని హెచ్చరించేవారు. ఈ విషయాలను పాత గ్రంథాల నుండి తవ్వితీసిన ఉపదేశాలుగానో లేదా పాత సంప్రదాయాలకు చెందిన బూజుపట్టిన భావనలుగానో ఎంత మాత్రం భావించవద్దు.

సాధనలో మొదటిసారిగా ప్రబలమైన అడ్డంకులు ఎదురయ్యే సమయాన్ని గడ్డుకాలమని చెప్పకతప్పదు. ఎంతో ఓరిమితోనూ, పట్టుదలతోనూ జపధ్యానాల సాధనను కొనసాగిస్తే, నెమ్మదిగా మంచికాలం వస్తుంది. ఆ ప్రతి పరిణామాలు ఎదురైన సమయంలో మనలో ఉన్న అద్భుతమైన మానసికశక్తి దారి తప్పే అవకాశం ఉంది కాబట్టి, దాన్ని అదుపులో ఉంచాలి. లేకపోతే సాధనలు సాగించడానికి ఆ శక్తి చాలక పోవచ్చు. మనకు ఎంతో బలమైన మనస్సు, శరీరం ఉన్నా, అటువంటి

సమయంలో అస్థిరత్వంలో లేదా పిరికితనంలో మునిగిపోవచ్చు. ముందుగా మన మాట వినని మానసికమైన ఉద్వేగాలతో, ఊహలతో యుద్ధం చేయకతప్పదు. తర్వాత అనాలోచితంగా, అలవాటుగా చేసే పనులతో పోరాటం చేయాలి. ఆపైన మేధాపరమైన మనోవైఖరులతో పోరు సలపవలసి రావచ్చు. ఈ పోరాటాలన్నింటిలో గెలుపొందాక శాంతి, సౌఖ్యం, సామరస్యాలతో నిండిన కాలం వస్తుంది.

మన గురువులు చెప్పిన ఆదేశాలను చక్కగా పాటిస్తే, చాలావరకు, ఈ అడ్డంకుల బారినపడకుండా గట్టెక్కవచ్చు. అలాగే సాధుపురుషుల సాంగత్యం కూడా ఎంతో సహాయపడుతుంది. ఎటువంటి ప్రతి పరిణామాలనూ ఎదుర్కోకుండా, మొదటినుంచీ సాధన నల్లేరు మీద నడకలా సాఫీగా, నిరాటంకంగా సాగుతూ ఉంటే, మీ సాధనలో ఏదో లోపం ఉన్నట్లు భావించవచ్చు. కావలసినంత తీవ్రతతో సాధన చేయక పోవడమో, లేదా ఆసక్తి ఏమీ లేకుండా, యాంత్రికంగా సాధన చేయడమో మీ సాధనలోని లోపాలు కావచ్చు.

సమస్యలు, తికమకలు ఎదురైనంత మాత్రాన మీరు తీవ్రంగా సాధన చేస్తున్నట్లు లెక్క కాదు. ఆధ్యాత్మికం కాని సమస్యలు, ఆధ్యాత్మికమైన సమస్యలతో కలగలసిపోయి మీరు ఎంతో పరిశ్రమిస్తున్న భావనను కలగ జేయవచ్చు. ఊక, పప్పు త్వరలోనే వేరవుతాయి. ఇందులో సందేహం లేదు. యథార్థంగా పారమార్థిక ఆసక్తి కలవారు, ఈ సమస్యలనన్నింటినీ జయప్రదంగా పరిష్కరించి, పురోగతి సాధిస్తారు. లేని ఆధ్యాత్మికాసక్తిని కృత్రిమంగా ఉత్తేజితం చేసుకున్నవారు, చిన్న చిన్న సమస్యలు ఎదురవ్వగానే తమ పోరాటాన్ని ఆపివేస్తారు. ఇటువంటి వారు ఒక్కొక్కసారి ఆసుపత్రికి వెళ్ళవలసివచ్చినా ఆశ్చర్యం లేదు.





## సాయి సేవక్

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

**(గత సంచిక తరువాయి)**

బాబా హారతులను 1. సంత్ తుకారాం, 2. సంత్ జానాబాయి, 3. సంత్ నామదేవ్, 4. శ్రీకృష్ణ జోగేశ్వర భీష్మ, 5. శ్రీ దాసగణు మహారాజ్, 6. మాధవరావు వామనరావ్ అడ్కర్, 7. పండిట్ శ్రీ మోహినీరాజ్, 8. శ్రీ ఉపాసనీ బాబా, 9. శ్రీ రామేశ్వర్ భట్, 10. శ్రీ బి.వి. దేవ్ మరియు 11. శ్రీ రామ జనార్దన స్వామి రచించారు.

బాబా ఏకాదశ సూత్రములను బాబా అనేక సందర్భాలలో భక్తుల కిచ్చిన అభయాలను సేకరించి క్రోడీకరించి మన కందించిన పుణ్యమూర్తి పండిట్ శ్రీ మోహినీరాజ్. దీనిని గమనించని చాలామంది బాబా మహా సమాధికి కొద్ది క్షణముల ముందు భక్తుల కిచ్చిన అభయములని తలపోస్తున్నారు. ఇది సరియైన అవగాహన కాదు.

మన పూజ్య స్వామీజీ పురాతన మరాఠీ సాయిలీల మాసపత్రికల నుంచి మరియు అసంఖ్యాక సాయి భక్తుల నుంచి సాయి దివ్య లీలలను సేకరించి భక్తులకు వివరించేవారు. వాటిలో అతి ముఖ్యమైన వాటిని మీ ముందుంచుతున్నాను.

బాబా రెండవ పర్యాయము షిరిడీ వచ్చినప్పుడు ఖండోబా మందిర పూజారి బాబాను "ఆవో సాయి" అని ఆహ్వానించుట మనందరికీ విదితమే. కానీ బాబా 1853 లేక 1854లో ప్రథమంగా షిరిడీ వచ్చినప్పుడు, షిరిడీ గ్రామస్తులు ఆయన పేరు, ఊరు అడగగా బాబా "మై సాయి హై, గోసాయి హై లంబే లంబే సే ఆయే హై" అని చెప్పినట్లు పాండురంగ కావడే అనే భక్తునిచే రచించబడిన ఒక గ్రంథంలో ప్రస్తావించినట్లు స్వామీజీ చెప్పి బాబాకు ఎవరు పేరిడినా ఆ నామ మహాత్మ్యాన్ని మనం గుర్తించాలి, ఈ

కలియుగంలో "సాయి" అన్న రెండక్షరాలు భక్తుల పాలిటి కల్పతరువు, కామధేనువు కన్న మిన్న. "సాయి" అన్న పదం ఉచ్ఛరించిన మాత్రాన సర్వ నదులలో స్నానమాచరించిన ఫలితం, సకల పుణ్యక్షేత్రాలను దర్శించిన ఫలితం కలిగి ఆ "సాయి" నామమే మనని భవసాగరము దాటించే నావ యని గ్రహించి సాయిభక్తులు ఎల్లవేళలా సాయి నామ స్మరణ చేస్తే అదే వారికి శ్రీరామరక్ష అని పేర్కొనేవారు.

ఒక పర్యాయం రాధాకృష్ణ ఆయీ జ్వరంతో బాధపడుతుండగా బాబా ఆమె ఇంటి దగ్గరకు వచ్చి తన నిచ్చెన తెప్పించి ఆ నిచ్చెన మీదుగా ఇంటి మీదకెక్కి మరొక వైపు నుంచి దిగి రాధాకృష్ణ ఆయీకి స్వస్థత చేకూర్చిన వైనం సాయిభక్తులందరికీ విదితమే. ఆ నిచ్చెన తెచ్చిన వ్యక్తికి బాబా రెండు రూపాయలనిచ్చి కష్టానికి మించిన కూలినివ్వాలని తెలియజేసిన సంగతి కూడ మనందరికీ తెలుసు. ఆ నిచ్చెన తెచ్చిన వ్యక్తి పేరు వెంకూ షింపే కాంబ్లేకర్ అనియు అతనికి సంతానం లేకపోవటంతో బాబా ప్రసాదించిన రెండు రూపాయలను తన పూజా మందిరంలో ఉంచి పూజించగా అనతి కాలంలోనే అతనికి ఇరువురు మగ సంతానం కలిగినట్లు స్వామీజీ కాంబ్లేకర్ పెద్ద కుమారుడైన అనంతరావ్ కాంబ్లేకర్ ద్వార తెలుసుకున్నట్లు వివరించారు.

నిచ్చెన తెచ్చినందుకే బాబా రెండు రూపాయలనివ్వటం అందరినీ ఆశ్చర్యపరచగా అతని చిరకాల మనోవాంఛ నీడేర్చి సంతానాన్ని ప్రసాదించిన వైనం ఎంతమందికి తెలుసన్నది అనుమానాస్పదమే.

బాబా సశరీరులుగా నున్నప్పుడు అరుదుగా నీంగాంలోని డేంగలే గృహమునకు, రహతా నివాసియైన కుశాల్‌చంద్ గృహములకు వెళ్ళెడి వారు. బాబా షిరిడీ పొలిమేరలు దాటుతున్నారన్న విషయాన్ని తెలుసుకొని వారి భక్తులు బాబాను షిరిడీ వీడి వెళ్ళవద్దని వేడుకునేవారు. వారి ప్రార్థనను మన్నించి సాయం సమయానికి తిరిగి షిరిడీ వస్తానని వారికి





అభయమిచ్చి వారి కోర్కెను మన్నించెడివారు.  ఒక పర్యాయము బాబా నీంగాంలోని డేంగలే  గృహమునకేగి అతని యోగక్షేమము లరయు చుండ పెరటి చెట్టు మీద ఒక పక్షుల జంట సభాషించుకొనుట గమనించిన బాబా అవి ఏ విషయము చర్చించుకొనుచున్నవో తెలుపు మని పక్షిభాష నెరంగిన డేంగలేను అడుగగా ఆ రోజు షిరిడీలో శని మందిరమునందు శని దేవునకు సమర్పిస్తున్న ప్రసాదంలో ఒక విషసర్పం పడి చచ్చినదని అది తిన్న తొమ్మిది మంది భక్తులు మరణిస్తారని ఆ పక్షులు సంభాషించుకుంటున్నట్లు డేంగలే వివరించెను. అది విన్న వెంటనే బాబా టాంగాలో షిరిడీలోని ద్వారకామాయికి వచ్చి అచట నున్న భాగోజీతో ఆ విషపూరితమైన ప్రసాదాన్ని నేలపాలు చేయించగా అచట నున్న భక్తులం దరు కోపోద్రేకముతో భాగోజీని శిక్షించటానికి వెంటపడగా అతను బాబాను శరణువేడాడు. బాబా వారిని వారించి ఆ ప్రసాదం మొత్తాన్ని నేల మీద గ్రుమ్మరించగా అందులో చచ్చి పడి ఉన్న సర్పమును గాంచి తమ ప్రాణములను కాపాడిన సాయినాథునికి కృతజ్ఞతలు తెలుపగా బాబా వారి కృతజ్ఞతలు డేంగలేకు తెలుపవలెనని అతనే వారి ప్రాణదాత యని జరిగినదంతా వారికి వివరించెను. సర్వ ప్రాణకోటిలోను తానై ఉన్న బాబాకు పక్షి భాష తెలియదా? యన్న సందేహం మానవ మాత్రులమైన మనకు కలుగుట సహజం. ఈ సందేహమునే స్వామీజీ చెంత ప్రస్తావించగా ఆయన చిరునవ్వుతో "సాయినాథుని ఆజ్ఞ లేక ఆకైనా కదలదు. బాబా సర్వాంతర్యామే కాదు త్రికాలవేది కూడ. ఆయనకు సర్వము అవగతమే. బాబా ఎప్పడు కీర్తి ప్రతిష్టలకు ప్రాకులాడే వారు కాదనియు, ప్రతి మంచి కార్యానికి ఎవరినో ఒకరిని నిమిత్తమాత్రునిగా చేసి ఆ కీర్తి, ప్రతిష్టలకు తాను కడుదూరంగా ఉండే వార"ని స్వామీజీ సెలవిచ్చారు. "జ్ఞానరాశియై యుండియు సామాన్య మానవుని వలె, చక్రవర్తి అయ్యుం డియు ఫకీరువలె, పంచభక్ష్య పరమాన్నములను రజిత పాత్రలలో

ఆయనకు సమర్పించినను భిక్షాటనతో జీవనాన్ని కొనసాగించిన పరమ పూజనీయుని పాదార విందములను మన మాశ్రయించుట మన పూర్వ జన్మ సుకృతమే"నని వచించేవారు మన స్వామీజీ.

బాబా మహాసమాధికి పూర్వం ఒక కుగ్రామములో నివసిస్తున్న వనితకు వయస్సు మీరుతున్నాగాని వివాహం కాకపోతే ఆమె బాబాకు తన వివాహం త్వరగా జరిగేటట్లు అనుగ్రహిస్తే షిరిడీకి వచ్చి బాబాను దర్శించుకుని ఒక నారికేళమును సమర్పించెదనని మ్రొక్కుకున్నది. ఆమెకు బాబా యందు అచంచల విశ్వాసం గలది. భక్త వత్సలుడైన సాయి ఆమె మొరనాలకించి వివాహం జరిపించారు. ఆమె తల్లిదండ్రులు చీర, సారెతో ఆమెను అత్తారింటికి పంపి తమ బాధ్యతను నెరవేర్చుకున్నారు. ఆమె అత్తింటి వారికి బాబా యందు విశ్వాసమే లేకపోగా బాబాను దుర్భాష లాడెడివారు. అట్టి వారు తనను బాబా దర్శనానికి పంపరని నిశ్చయించు కుని బాబాయే వారి మనస్సులను మార్చి తనను షిరిడీకి రప్పించుకోమని బాబాను మనసారా వేడుకుంది. "నా భక్తులు ఎంత దూరమున నున్నను, సప్త సముద్రములావల నున్నను, పిచ్చుక కాళ్ళకు దారము కట్టి లాగు చందమున వారిని నా వద్దకు రప్పించుకుంటాను" అని అభయమిచ్చిన బాబా తన భక్తురాలు తన దర్శనార్థమై తహతహలాడుతుంటే మిన్న కుండునా! ఆమె భర్త మనస్సు మార్చుటయేగాక ఆమె షిరిడీ ప్రయాణము నకు ఏర్పాట్లన్నియు అతని చేతనే చేయించి ఆమెను తన చెంతకు రప్పించుకొనెను. ఆమె బాబాను దర్శించి బాబా దివ్య స్వరూపమును కనులార గాంచి ఆనందము పరవళ్ళు త్రొక్కుచుండ బాబా పావన చరణాలపై తన శిరస్సు నుంచి బాబాకు తన కృతజ్ఞతలు తెలియజేసు కొనెను.

**(సశేషం)**





# ధన్యజీవి స్వర్గీయ శ్రీ మండువ రంగారావు

- శ్రీనివాసరావు గుర్రం

సృష్టిలో మానవజన్మ ఎంతో విశిష్టమైనది. కానీ, జీవితాలను సార్థకం చేసుకొనేది బహు కొద్దిమంది మాత్రమే.

అలాంటి ధన్యజీవులలో ఒకరు నిత్య సాయి సేవా తత్పరులు శ్రీ మండువ రంగారావుగారు. మానవ సేవయే మాధవసేవగా భావించిన, జీవించిన మహా మనిషి. గుండె నిండా దేశభక్తిని నింపుకొని చివరి శ్వాస వరకు ఆ సేవలోనే తనువు చాలించిన అకుంఠిత దేశభక్తుడు, సాయిధామం చిరకాల కార్యకర్త, పూజ్య గురుదేవులచే "రంగరాయ" బిరుదు పొందిన గొప్ప భక్తులు. "శ్రీ సాయి సచ్చరిత్ర" నిత్య పారాయణ పద్యకావ్య గ్రంథం రచించిన సాహితీవేత్త.

ధర్మాత్ములు శ్రీ రామచంద్ర ప్రభువులా స్మిత పూర్వ భాషి. పరిచయ మున్న అందరికీ ఆత్మబంధువు. తన మంచితనంతో అందరి మనస్సులు గెలుచుకొన్న మహానుభావుడు, నిగర్వి, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం.

ఉత్సాహమే ఊపిరిగా జీవితాన్ని ప్రతిక్షణం ఆనందించిన పుణ్యమూర్తి శ్రీ రంగారావుగారు. 1949 సంవత్సరం సెప్టెంబర్ 9వ తేదీన అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలోని మండువ వారి పాలెం గ్రామంలో జన్మించారు. 96 సంవత్సరాల తల్లిని వదలి ముందుగానే అసువులు బాసారు తండ్రి స్వర్గీయ రామయ్య.

పాఠశాల, కళాశాల విద్యాభ్యాసం ఒంగోలులో పూర్తి చేసారు. ఉస్మానియా యూనివర్శిటీలో కెమికల్ ఇంజనీరింగ్ చదివారు. చివరి క్షణం వరకు నిత్య విద్యార్థిగా జీవించిన విజ్ఞులు. నాలుగు సంవత్సరాల నుండి కెమికల్ ఇంజనీరింగ్‌లో శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయంలో పి.హెచ్‌డి. పూర్తి చేసి డాక్టరేట్ అర్హతకు పరిశోధనా గ్రంథం సమర్పించ డానికి సిద్ధంగా వున్నది.

రంగారావుగారు వృత్తిరీత్యా ఎన్.ఎఫ్.సి. విశ్రాంత శాస్త్రవేత్త.

ప్రవృత్తిరీత్యా బహుముఖ ప్రజ్ఞాశాలి. మానవతావాది. శ్రీమతితో కలిసి కూడా ఎన్నో సేవా కార్యక్రమాలలో పాల్గొన్నారు. నిబద్ధ స్వయం సేవక్‌గా గుర్తింపు పొందారు. హొమియో విద్యను అభ్యసించి ఎందరికో సేవలందించిన వైద్యులు.

కనుమరుగవుతున్న ఛందోబద్ధ ప్రక్రియకు ఊపిరిలూది ఎంతోమంది సాహితీవేత్తలను ఉత్సాహపరిచి తెలుగు సాహితీ వనంలో “తెలుగు కవిత లల్లుదాం” అనే ఒక సాహితీ సమూహాన్ని నిర్వహిస్తున్న తెలుగుతల్లి ముద్దుబిడ్డ.

వివిధ రంగాలలో శ్రీ రంగారావుగారిని గురుతుల్యులుగా భావించే ఎంతోమంది శిష్యగణాన్ని కలిగి వుండటం అతి తక్కువమందికి జీవిత కాలంలో లభించే ఒక గొప్ప వరం.

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజనీర్స్ (ఐఐసిహెచ్ఇ) జాతీయ కార్యనిర్వాహక సమితి సభ్యునిగా, సంయుక్త కార్యదర్శిగా, హైదరాబాద్ రీజనల్ విభాగం ఉపాధ్యక్షులుగా, విద్యార్థి మానవ వనరుల కౌన్సిల్ అధ్యక్షునిగా వివిధ హొదాలలో అమూల్య సేవలందించారు.


విజ్ఞానభారతి తెలంగాణా రాష్ట్ర శాస్త్రవేత్తల విభాగంలో కార్య నిర్వాహక సభ్యులుగా సేవలందించారు.

ఈనాడు రంగారావుగారు భౌతికంగా మనతో లేకపోయినా అందరి హృదయాలలో చిరస్మరణీయులుగా సజీవంగానే వున్నారు. వీరి జీవితం సేవాతత్పరులందరికీ ఒక ఆదర్శం.

## శ్రీ సాయిబాబా సూక్తులు

**గంధపుచెట్టు తనను నరికే వాడికి కూడా సుగంధాలు అందించే విధంగా మన జీవన విధానం ఉండాలి. ఎప్పుడైనా సరే మనకు తెలియకుండా మన వలన ఎదుటివాడికి ఏమైనా నష్టం, కష్టం కలిగితే, అది తెలుసుకుని పశ్చాత్తాపపడి వారిని మనస్ఫూర్తిగా క్షమాపణ కోరాలి, మరో పర్యాయం అలాంటి సంఘటనలు జగకుండా చూసుకోవాలి. పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చిత్తం లేదు. పశ్చాత్తాపం చెందిన వారిని భగవంతుడు క్షమిస్తాడు**





# గురుపూర్ణిమోత్సవం

ప్రియ సాయి భక్తులారా!

**నారాయణ సమారంభాం వ్యాసశంకర మధ్యమాం**
**అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరామ్ ॥**

గురుసేవతో తప్ప ముక్తి లేదని మన ధర్మం చెప్తున్నది. భారతీయ యోగులంతా దీని ప్రకారమే గురుసేవతో తరించిన వారే. అట్టి గురు పరంపర ప్రారంభమైన గురుపూర్ణిమను, సాయిధామంలోని ‘ద్వారవతి’లో శ్రీ సాయినాథ, దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగి 25 సం.లు పూర్తి అయిన సందర్భాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని ఈ విధంగా జరుపుకుందాం.

**జూలై 24, 2021 శనివారం**

| | | |
|---|---|---|
| ఉదయం | 5.10 | కాకడ హారతి, |
| | 6.30 | బాబా వారికి, దత్త స్వామికి క్షీరాభిషేకం |
| | 7.00 | గురుదేవుల విగ్రహానికి క్షీరాభిషేకం |
| | 8.00 | సాయినాథుల వారికి అష్టోత్తర శతనామ పూజ |
| | 10.00 | శ్రీ సాయినాథుల వారికి పుష్పాలతో సహస్ర నామార్చన |
| | 11.30 | గురుపూజ అనంతరం స్వామీ శ్రీశ్రీశ్రీ -శ్రీరామానంద ప్రభుజీ ప్రవచనం |
| | 12.00 | సాయినాథుల వారికి మహా హారతి |
| మధ్యాహ్నం | 1.00 | అన్నప్రసాద వినిమయం |

భక్తులందరికీ ఇదే ఆహ్వానం. పై కార్యక్రమాలకు ఏవిధంగానైనా సహకరించగలిగితే దానికీ భక్తులకు ఇదే ఆహ్వానం.

ఇట్లు,

**సాయిధామం.**

**ఫోన్స్ : 9848133565, 9440413455**

శ్రీ కృష్ణావతారం

# శాశ్వత ధర్మగోప్త



- రచన : భండారు సదాశివరావుగారు

**(గత సంచిక తరువాయి)**

హఠాత్తుగా అర్జునుడు లేచాడు. ముందుకు నడిచి సభకు, ద్రుపద మహారాజుకు నమస్కరించాడు. ఆ మహాధనుస్సుకు ముమ్మారు ప్రదక్షిణం చేశాడు. క్రింద నీటిలో ఆ చక్రపు తిరుగుడును గుర్తించాడు. అవలీలగా ధనువును ఎత్తివింటినారిని బంధించి, ఆకర్ణాంతం లాగి క్రింద నీటిలో చూస్తూ విద్యుత్‌వేగంతో అయిదు బాణాలను ఏకకాలంలో విడిచినట్లు ప్రయోగించడమేమిటి, మత్స్యం తెగి క్రింద నీటిలో పడి, కరతాళధ్వని చేసిందా అన్నట్లు చప్పడుచేయడమేమిటి, సభ అవాక్కై, దిక్కులు పిక్కటిల్లేట్లు జయధ్వానాలు చేయడమేమిటి అన్నీ ఏకకాలంలో జరిగాయి. అదొక మహా సంఘటన.

దుర్యోధనాదులకు ఒక బ్రాహ్మణుడు స్వయంవరంలో పాల్గొని పాంచాల రాజకన్యను గెలుచుకోవడం క్షాత్రానికీ సంప్రదాయానికీ విరుద్ధమనిపించింది. కాని కృష్ణుడు వారిని శాంతింపచేసాడు. ఆ పరాభవానికి క్రుంగి పరాభూతులై కౌరవాదులు, జరాసంధబృందం స్వస్థలాలకు వెళ్లిపోయారు. ద్రౌపది విజయమాలను అర్జునుని మెడలో అలంకరించింది.

పాండవులు సభాస్థలం నుంచి, పాంచాలీ సమేతంగా వెంటనే తాము బసచేసిన కులాలుని యింటికి చేరారు. ద్వారంలోకి ప్రవేశిస్తూ యుధిష్ఠిరుడు 'అమ్మా! ఒక అమూల్యమైన భిక్షను తెచ్చామమ్మా' అని సహజమైన ఆనందంతో అన్నాడు.

కుంతికూడా సహజంగానే కొడుకులు ఇంటికి వచ్చారనే ఆనందంతో





'అందరూ సమంగా అనుభవించుకోండి' అని దీవించింది. తీరా ఆ దీవెన అశనిపాతమైంది. ఒక్క వధువును అయిదుగురూ అనుభవించడమా? పంచుకోవడమా? మరి తల్లిమాటను కాదనరాదనే ప్రతిజ్ఞకు వాళ్లందరూ బద్ధులు.

స్వయంవరానికి వచ్చిన వ్యాసులవారు ద్రుపద పురోహితులైన, యాజ, ఉపయాజులు, కృష్ణ బలరాములు, ద్రుపద, దృష్టద్యుమ్నులూ అక్కడికి వచ్చారు. పాండవ కులగురువు ధౌమ్యులవారు అక్కడే ఉన్నారు. ఆ కులాలుని ఇల్లు భారత భవిష్యత్తును నిర్ణయించే ధర్మక్షేత్రమైంది. శాస్త్ర మీమాంస జరిగింది. ప్రాచీన సాంప్రదాయాలను సమీక్షించారు. ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించారు. ఒక క్షీరసాగర మథనమే జరిగింది. ఆనాడు ఒక స్త్రీ పలువురిభర్తలను వరించే ఆచారం ఉన్నది. ఆ ఆచారాన్ని గుర్తించారు. కాని చేపట్టవలసింది ద్రౌపది. కనుక చివరి నిర్ణయాన్ని ఆమెకే వదిలారు.

పాండవులు ఒకటై ఉండాలి. అదీ సూత్రం. వారు ఏకాత్ములై ఉంటేనే ధర్మానికి, వారికి కూడా బలం. వారిని విభజించరాదు. కనుక వారి అయిదుగురినీ ఒకే హృదయంగా కలిపి, ఉంచడానికి తాను- యజ్ఞ సంభవ- జీవితాంతం బాధలను భరించక తప్పదు.

ద్రౌపది అయిదుగురినీ వరించింది. ఆ వివాహం కనీ వినీ ఎరుగనంత వైభవంగా జరిగింది.

పాండవులు బ్రతికేఉన్నారన్న వార్త ధృతరాష్ట్రునికి, అతని సంతానానికి పిడుగు పాటైంది. ఒక విధంగా వారికది మృత్యు సందేశమే.

కురువృద్ధులు సమావేశమైనారు. బ్రతికి ఉండగానే పాండవులను వారణావతంలో అగ్నిపాలుచేసి చంపారన్న అపవాదు తొలగినందుకు సత్యవతి, భీష్మ, ద్రోణులు, కృపాచార్య విదురులు హస్తినకు సమస్త రాజలాంఛనాలతో స్వాగతించడానికి విలువైన కానుకల్ని మహామంత్రి

విదురుణ్ణి సపరివారంగా వేదవిదులనూ, కురు ప్రముఖులనూ ద్రుపద నగరానికి పంపారు.

పాండవుల రాకతో హస్తినాపురం ఆనందతరంగితమైంది. వేయి దీపావళులు వెలిగాయి. వారి వెంట కృష్ణ బలరాములతోపాటు యాదవ అతిరథ, మహారథ బృందం కూడా వచ్చింది.

పాండవుల సహజాధికారాన్ని కాదనే సాహసం ధృతరాష్ట్రునికి లేదు. సత్యవతీ, భీష్ముల నిర్ణయంతో కురుసామ్రాజ్యానికి యుధిష్ఠిరుణ్ణి రాజుగా, దుర్యోధనుణ్ణి యువరాజుగా అభిషేకించారు. పాండవ- కౌరవ కలహాలను శాశ్వతంగా పరిష్కరించేందుకు రాజ్యాన్ని, స్థిర, చరాస్తులను, సేనను సమంగా విభజించి, పాండవులను ఇంద్రప్రస్థానికి పంపారు. ద్రుపదుడు తనవంతుగా అశేష ధన, కనక, వస్తు వాహనాది సంపదలను భరణంగా ఇచ్చాడు. యాదవులు కూడా తమ సంపదలలో అయిదవవంతు కట్నంగా తన మేనల్లుళ్ళకు ఇచ్చారు. నూతన వధువుగా, కురువంశానికి పెద్దకోడలుగా, కాబోతూన్న సామ్రాజ్ఞిగా హస్తినకు వచ్చిన ద్రౌపదికి ధృతరాష్ట్రుడు కురుజాంగలంలో కొంత భాగాన్ని కట్నంగా ఇచ్చాడు.


యాదవ, పాంచాలుల సహకారంతో ఇంద్రప్రస్థం మహానగరంగా, మయునిచే నిర్మాణమైంది. హస్తిన నుండి కౌరవుల పరిపాలనలో ఉండదలచని విప్రులు, వణిక్కులు, మల్లులు, క్షత్రియ కుటుంబాలు, ప్రజలు వేలాదిగా ఇంద్రప్రస్థానికి తరలివెళ్లారు. ఇంద్రప్రస్థం పాండవుల ఏలుబడిలో ధర్మకేంద్రంగా రూపొందింది. కృష్ణునికి కృష్ణద్వైపాయనునికి పాండవులు ధర్మసంస్థాపనకు కేంద్రస్థానంలో నిలబడగలరనే విశ్వాసం ఏర్పడింది.

ఆ తరువాత కృష్ణ, బలరామ, సాత్యకి, అక్రూరాది యాదవ బంధుగణం, కుంతి, యుధిష్ఠిరాదులవద్ద సెలవు తీసుకొని, ద్వారకకు బయలుదేరారు.

"వాసుదేవా! నీవే మాకు బలం. మమ్మల్ని కనిపెట్టి ఉండే బాధ్యత నీదే సుమా" అని సజల నయనాలతో, యుధిష్ఠిరుడిచ్చిన వీడ్కోలు అందరినీ కదిలించింది. **(సశేషం)**







# సాయిభక్త దాసగణు

రచన : విజయ కిషోర్

**(గత సంచిక తరువాయి)**

ఈ పోలికలోని వేణువు పాత్రను ఇంకొంచెం నిశితంగా పరిశీలిస్తే, వేణువు అనేది ఒక శూన్యమైన వెదురుగొట్టం. ఆ శూన్యమైన వెదురుగొట్టం తనకైతాను గానం చేయలేదు. కానీ, ఆలాపకుడు ఆ వెదురు గొట్టాన్ని ఊదుతూ, తన చేతివ్రేళ్లను ఆ వెదురు రంధ్రాలపై లయబద్ధంగా ఆడించితే ఒక రాగం ప్రభవించి, పారవశ్యం గొలిపే గానమై ప్రవహిస్తుంది. అంటే, ఆలాపకుడు లేని వేణువు కేవలం ఒక శూన్యమైన వెదురు గొట్టమే! అలాగే ఆ వేణువు లేకుండా కూడా గానం వెలువడదు. అందువలన ఆలాపకుడు మరియు వేణువుల సంయోజనీయత వలనే గానం వెలువడుతుంది. వినేవారి హృదయాన్ని ఆనందడోలికలలో ఊయలలూగిస్తుంది. సరిగ్గా అలాగే సద్గురువు ఆలపించే దివ్యరాగం తమ భక్తుని చెవికి చేరాలంటే- ఆ భక్తుడు సద్గురు చరణాల చెంతకు చేరాలంటే- మిష అనే వేణువు తప్పనిసరి! ఆ దృష్ట్యా సద్గురువు చెంతకు చేర్చే ప్రతి కష్టం, స్వప్నం, దేహం అన్నీ ఆయన పిలుపుని వినిపించే వెదురుగొట్టాలే! ఆయన చరణాల చెంతకు కొనివచ్చే వేణునాదాలే!

బృందావనిలో శ్రీ కృష్ణుని దివ్య వేణునాదానికి పరవశిస్తూ, పరితపిస్తూ అనురాగ బంధంతో ఆ వేణుగోపాలుని చుట్టుముట్టి గోపికలు చేసే ఆనంద నృత్యహేలలలో అద్భుతమైన ఈ ఆధ్యాత్మిక సత్యమే అంతర్లీనంగా దాగియుంది. భగవంతుని సగుణరూపంతో (శ్రీ కృష్ణునితో) ఋణానుబంధంతో బంధించబడిన భక్తులు (గోపికలు) వివిధ మిషల ద్వారా ఆ సగుణ సద్గురుమూర్తి యొక్క (దివ్య వేణు నాదమనే) పిలుపును

విని, ఆర్తితో (ప్రేమతో) దరిచేరి, ఆ సద్గురుదేవుని దివ్యదర్శనంతో హృదయంలో అనుభవమయ్యే పారవశ్యానికి ప్రతిరూపమే గోపికలు ఆడే ఆ ఆనంద నాట్యం. (సద్గురు చరణాలను ఆశ్రయించిన తరువాతి దశలో జరిగే ప్రక్రియకు ప్రతిరూపంగా భగవంతుని పురుషునిగా, భక్తుని స్త్రీగా అభివర్ణిస్తూ, వారి దివ్య సంయోగమే అంటే ఏకత్రం చెందడమే ద్వైతం అద్వైతం చెందడమనే పారమార్థిక మార్గ పరమార్థానికి ప్రతీకగా రాధాకృష్ణులను వర్ణించడంలోని అంతరార్థం అదే!) ఆ విధంగా శ్రీ కృష్ణుని యొక్క దివ్య రాగసుధారస కేళిలో గోపికలు కృష్ణుని చేరడానికి వేణువు నిమిత్తమాత్రమయితే, శ్రీ సాయి యొక్క ఋణానుబంధ కేళిలో అసంఖ్యాక భక్తులను చరణాశ్రయులను గావించే ప్రక్రియలో దాసగణు నిమిత్త మాత్రుడయ్యాడు. ఒక్క మాటలో చెప్పాలంటే శ్రీ కృష్ణుని చేతిలో వేణువు పోషించిన పాత్రను, బాబా వద్ద దాసగణు పోషించాడు. కనుక ఒక మధురమైన వేణుగానం విని, వేణువు వలనే అంతటి అద్భుత గానం ఆవిష్కృతమైందని అనడంలో ఎంత అమాయకత్వం ఉంటుందో? దాసగణు కీర్తనల వలన బాబా భక్తుల సంఖ్య పెరిగింది అని అనడంలో అంతే అమాయకత్వం ఉంది.

"మై షీప్ విల్ హియర్ మై వాయిస్ అండ్ దె ఫాలో మి అండ్ ఐ గివ్ అన్టూదెమ్ ఎటెర్నల్ లైఫ్" (నా గొర్రెలు నా స్వరం వింటాయి మరియు నన్ను అనుసరిస్తాయి. నేను వాటికి శాశ్వతమైన జీవితాన్ని (ఆనందాన్ని) ప్రసాదిస్తాను) అనే క్రీస్తు ప్రవచించిన పదాల వెలుగులో పరికిస్తే, క్రీస్తు చేతిలోను మరియు చుట్టూ గొర్రెలు ఉండటంలో కూడా పై సత్యమే దర్శనమిస్తుంది. అంతేకాదు, మహాత్ముల అవతార కార్యంలోని పరమార్థం మరలా మనకు ప్రస్ఫుటమవుతుంది. అందుకే మహాత్ములందరి వక్తం ఎప్పుడూ ఒక్కటే, వ్యక్తీకరణే వేరు. కార్యమొక్కటే, కార్యాచరణే వేరు! "అల్లా నాకు అప్పగ్గించిన పైసలు" అని బాబా అంటే, "నా తండ్రి నాకు అప్పగించిన





గొర్రెలు" అని క్రీస్తు అన్నారు. అంతటా నిండిన పరబ్రహ్మతత్వానికి ప్రతిరూపం తామే అనే సత్యాన్ని నర్మగర్భంగా చెపుతూ, "నేనే అల్లాను" అని బాబా అంటే, "నేను నా తండ్రి ఒక్కరే" అని క్రీస్తు అన్నారు. అంతటా నిండిన భగవత్తత్వం ఒక్కటే అయినప్పుడు, ఆ భగవత్ తత్వానికి సగుణ రూపాలయిన మహాత్ముల భావాలలో భేదం ఎలా ఉంటుంది? సరి!

మంత్రోపదేశం పొందినప్పడు, శ్రీ వామనశాస్త్రి గారు తీసుకుంటానన్న గురుదక్షిణను బాబా అడగడం ప్రారంభించారు. అదెలాగంటే, మహాత్ముల చరిత్రను వ్రాసే క్రమంలో బాబా పట్ల భక్తిభావం క్రమంగా దాసగణు మనసులో పెరగసాగింది అని మనం ముందరే చెప్పకున్నాం. అందువలన తాను బాబా దర్శనానికి తరచుగా వెళ్ళసాగాడు. అలా వెళ్ళినప్పడు, తాను విన్న మహాత్ముల జీవన విశేషాలు, ఆయా మహాత్ముల మహిమలను తాను అక్షరబద్ధం చేస్తున్న తీరు, ఆ క్రమంలో తనకు అనుభవమవుతున్న ఆనందం వంటి విశేషాలను దాసగణు బాబాకు నివేదించేవాడు. దాసగణు పొందుతున్న పారమార్థిక పురోగతి పట్ల తమ సంతోషాన్ని వ్యక్తపరుస్తూ, బాబా తమ మనసులోని మాటను దాసగణుకి చెప్పారు. "మంచిది గణూ! నీవు ఈ కార్యాన్ని ఇలాగే కొనసాగిస్తూ ఉండు. ఇక నీవు నీ ఉద్యోగాన్ని కూడా వదిలేసి పూర్తిగా భగవంతుని సేవలోనే సమయాన్ని వెచ్చించు" అని చెప్పసాగారు. బాబా మాటలకు అవాక్కయిన దాసగణు మొదట్లో ఏమీ మాట్లాడకుండా ఉండిపోయేవాడు. కానీ, బాబా మాత్రం దాసగణు వచ్చిన ప్రతిసారీ ఇదే మాటను స్పష్టంగా "అరే గణూ! ఉద్యోగం వదిలేయ్. నువ్వేమయినా బూట్లు తుడవడానికి పుట్టావా? ఇదంతా నీకెందుకు? నా మాట విని ఉద్యోగం వదిలేయ్" అని చెప్పేవారు.

బాబా ఆ ప్రస్తావన తెచ్చినప్పడల్లా మొదట్లో మౌనంగా ఉండిపోయే దాసగణు, తరువాత మెల్లగా తన మనసులోని మాటను బాబాకు నిర్మొహమాటంగా చెప్పనారంభించాడు.

**(సశేషం)**

బాలవాణి

# పవిత్రుడు

చాలాకాలం తరువాత కలుసుకొంటున్నాం పిల్లలూ! అంతా క్షేమమేగా! ఇవ్వేళ సాధనతో తనకున్న చెడ్డపేరు పోగొట్టుకొని, పాపాత్ముని దశ నుంచి మహాత్ముని దశకు పెరిగిన ఒక మామూలు రైతును గూర్చి చెప్పకొందాం. ఇది మన దేశంలో జరిగింది కాదు. ఇంగ్లండు ప్రాంతాలలో జరిగింది.

అనగనగా ఒక ఊళ్లో ఇద్దరు అన్నదమ్ములున్నారు. పేదవారైనా శ్రమ పడి పని చేసుకొని బ్రతుకుతూ ఉండేవారు. శ్రమించే స్వభావం ఉండటం చేత వాళ్లకు పని యివ్వడానికి ఎవరూ వెనుకాడే వారు కారు. ఇలా ఉండగా ఆ ఊరున్న ప్రాంతాలలో పంట వేసినా ఎండిపోవటమో, విపరీతమైన పురుగు పట్టడమో-అలా అలా రెండు మూడేళ్లలో విపరీత మైన కరువు వచ్చింది. అనేకమంది ఇళ్లూ, వాకిళ్లూ విడిచిపెట్టి, దూర ప్రాంతాలకు వలసపోసాగారు. ఈ అన్నదమ్ములు కూడా తాము పుట్టి పెరిగిన ఊరు వదిలేసి ఎటో వెళ్లి ఒక ఊరు చేరుకున్నారు.

పనికోసం ఇంటింటికీ వెళ్లి అడగసాగారు అన్నదమ్ములు. అది వ్యవ సాయం కంటే గొర్రెలు, మేకలు, ఆవులు మొదలైన పశు సంపద మీద ఆధారపడిన ఊరు. వీళ్లేమో క్రొత్త వారు. మొత్తం మీద వీళ్లకు పని దొరక లేదు. పనే కాదు - వీళ్లకు తెలిసిన వారెవరూ లేకపోవటంతో పట్టెడు అన్నం పెట్టేవారు కూడా కరువయ్యారు. ఒక రోజు, రెండు రోజులు, మూడు రోజులు .... పది రోజులు గడిచాయి. వీళ్ల దగ్గరున్న ఒకటి, రెండు రూపా యలు అయిపోయాయి. మంచి నీళ్లతో, గాలితో ఎన్నాళ్లని బ్రతకగలరు?

ఒక రోజు ఆకలిబాధ మితిమీరిపోయింది. తమ్ముడు అన్నకు ఒక ఉపాయం చెప్పాడు. "ఎవరూ మనకు పనియివ్వరు, తిండి పెట్టరు. నేనీ ఆకలి బాధకు తట్టుకోలేకుండా ఉన్నాను. ఇవ్వాళ రాత్రి ఎవరి మందలో





నుంచైనా నాలుగు గొర్రెల్ని కొట్టుకొద్దాం. ఎటైనా వెళ్లిపోయి సంతలో వాటిని అమ్ముకొని హాయిగా ఏదైనా వ్యాపారం చేసుకొని బ్రతుకుదాం" అన్నాడు. "అది తప్పు. పట్టుబడితే మన గౌరవం పోతుంది. శిక్ష పడుతుంది. మన ఊరి వారికి తెలిస్తే మనను చీదరించుకుంటారు. ఇకపైన ఎక్కడ ఏ దొంగతనం జరిగినా ముందుగా మన మీదికే అనుమానం వస్తుంది. ఒకవేళ మనుష్యులకు చిక్కకుండా తప్పించుకున్నా గానీ - పరమాత్ముడి కళ్లైతే కప్పలేం గదా! ఆయన శిక్ష నుంచీ తప్పకోలేం. అంచేత యీ పాపపు పని మనకు వద్దురా తమ్ముడూ! ఈ చోటు కాకపోతే మరోచోటికి పోదాం" అన్నాడు అన్న.

"ఆ! యింకోచోటికి పోతే అక్కడ మాత్రం మనకు తెలిసిన వాళ్లెవరైనా ఉన్నారా? ఐనా మనం దొంగతనమే పనిగా పెట్టుకొని బ్రతుకుదామను కొంటున్నామా ఏం? ఈ ఒక్కసారికీ సరే అను అన్నయ్యా! ఆకలితో నా కడుపులో పేగులు లుంగలు చుట్టుకుపోతున్నాయి. నీరసంతో రెండడుగులు వెయ్యటం కూడా కష్టంగా ఉందన్నయ్యా.... "ఈ మాటలం టుండగానే తమ్ముడి కళ్లలో నీళ్లు నిండాయి. అది చూచిన అన్న మనసు కరిగిపోయింది. భారం భగవంతుడి మీద వేసి "సరే" అన్నాడు.

చెడ్డ పనులకు భగవంతుడెందుకు బరువు మోస్తాడు? ఆ రాత్రి నాలుగు గొర్రెలను మంద నుంచి తప్పించి తోలుకు వస్తుండగా కాపలా వారు చూడనూ చూచారు. పట్టుకోనూ పట్టుకొన్నారు. ఇన్నేళ్ల తన మర్యాద పాడైపోయిందన్న దుఃఖంతో అన్న, తాను మునిగేది గాక అన్నను కూడా ముంచితినే అని తమ్ముడు బాధపడుతున్నారు. ఆ రోజులలో వాళ్ల ప్రాంతంలో ఉన్న అలవాటు ప్రకారం వాళ్లకు నూరు కొరడా దెబ్బలు కొట్టే శిక్ష వేసారు. పైగా కాల్చిన ఇనుప చువ్వతో నుదుటి మీద 'ఎస్ టి' అనే ఇంగ్లీషు అక్షరాలు వాతపెట్టారు. పాపం, యిక అవి జీవితాంతం పోవు. ఎస్‌టి అంటే 'షీప్ థీవ్స్' - గొర్రెల దొంగలు అని అర్థం.

ఈ సంఘటనతో అన్నదమ్ములు క్రుంగిపోయారు. వద్దంటున్నా వినకుండా అన్నగారిని ప్రోత్సహించి, దొంగపనిలోకి దింపి శాశ్వతంగా ఆయనకొక మచ్చ తెచ్చానే అని తమ్ముడు మరీ మరీ దుఃఖించాడు. రెండు మూడు రోజులు గడిచాయి. వీరిద్దరూ తమకు శిక్ష విధింపబడిన చర్చి ఎదురుగా చెట్టు క్రిందనే పడి ఉన్నారు. వారికి పట్టెడు అన్నం పెట్టిన వారు లేరు. తమ్ముడు మూడవ నాటి రాత్రి నిద్రలో ఉన్న అన్నగారి పాదాలకు నమస్కారం చేసి, ఏడుస్తూ మెల్లగా ఆ చోటు విడిచి వెళ్లిపోయాడు. అన్న గారికి తన మూలంగా చెడ్డ పేరు వచ్చింది గనుక మరెన్నడూ తన ముఖం ఆయనకు చూపించలేక - దూరంగా తరలిపోయాడు ఆ తమ్ముడు. ఉదయం లేచి చూచిన అన్నగారు తమ్మునితో తనకు కలిగిన ఎడబాటుకు ఎంతో వ్యథ చెందాడు. కానీ, ఆయన ఊరు విడిచి పోదలచుకోలేదు. తాను చేసింది దోషం. తనపై పడిన యీ ముద్రతో ఎక్కడకు వెళ్లినా అవమానమేగానీ సన్మానం లభించదు. ఇక్కడే బ్రతకాలి. బ్రతక లేకపోతే యిక్కడే చావాలి. స్థిరంగా నిర్ణయించుకున్న అన్నగారు దేవాలయ ప్రాంగణంలోనే ఉండిపోయాడు.

మొదట అతన్ని చూచిన వారంతా దూరంగా తొలగిపోయేవారు. ఎవరూ పలకరించేవారుకారు. అన్న దేవాలయ ప్రాంగణమంతా శుభ్రంగా ఊడ్చేవారు. చుట్టూ ఉన్న తోటలోని మొక్కలకు పాదులుచేసి నీళ్లు పోసేవాడు. ఎవరైనా ఏదైనా యింత చేతిలో వేస్తే తినేవాడు. లేకపోతే సింహద్వారం ప్రక్కనున్న చెట్టుక్రింద ముడుచుకొని పడుకొనేవాడు. అలా నాలుగైదు రోజులు గడిచాక- ఒకరోజు పూజారి కొందరు భక్తులను పిలచి యిలా అన్నాడు. మనుషులన్నాక ఏవో కొన్ని తప్పులు చెయ్యటం సహజం. పశ్చాత్తాపంతో వాటిని దిద్దుకొని బాగుపడదలచిన వారికి మనం సహక రించటం ధర్మం. అంచేత అతడు ఆకలితో చచ్చిపోకుండా ఏదైనా పని చూపిద్దాం. గుడి ఆవరణ శుభ్రంగా ఉంచటం, తోటపని చెయ్యటం బాగా





చేస్తున్నాడు. అంచేత ఆ పనులే అప్పగించి ఏదో భుక్తికింత ఏర్పాటు చేస్తే మంచిదని నా ఉద్దేశ్యం. మీరంతా సరేనంటే అలా చేద్దాం".

కొంతసేపు తర్జన-భర్జనలైన తరువాత అందరూ సరేనన్నారు. అలా "అన్న" దేవాలయంలో పనివాడుగా మారిపోయాడు.

సహజంగా అన్నది దయాహృదయం. తనకున్న దానిలోనే ఎవరికైనా యింత పెట్టటం, ఎవరికైనా కష్టం వచ్చిందంటే పరుగున వెళ్లి ఆదుకోవటం అన్నవి అతనికి స్వభావంతో ఉన్న గుణాలు. ఈ కొత్త చోట కూడా అతడు అలాగే అందరితో ప్రేమగా మసలు కోవటం, భిక్షగాళ్లను కూడా ఆదరంతో పలకరించటం, నిత్యం శుచిగా ఉండటం, ప్రతిపూజలోనూ ఎంతో భక్తితో పాల్గొనటం చేయసాగాడు. అలా రోజులు వారాలై, వారాలు నెలలై, అవి సంవత్సరాలుగా మారిపోతోంటే- అన్న ఊరివారికి సన్నిహితంగా రాసాగాడు. ఎక్కడ భజనలైనా, ఉత్సవాలైనా, గ్రామం అంతా పాల్గొనే కార్యక్రమాలేమి జరిగినా యితనే బాధ్యత మీద వేసుకొని నడిపేవాడు. ఫలితం ఆశించకుండా పనిచేసే యితని ప్రవర్తన మెల్లమెల్లగా గ్రామీణులలో ఎంతో మార్పు తెచ్చింది. దానికితోడు ఇతడు గుడిలోకి వచ్చిన పెద్దలు, సాధు సత్పురుషులు ఇచ్చే ఉపన్యాసాలన్నీ వినేవాడు. పూజారిగారు భక్తులతో జరిపే సంభాషణలు శ్రద్ధగా ఆలకించేవాడు. వచ్చీరానీ అక్షరాలు కూడబలుక్కొంటూ మంచి పుస్తకాలు పూజారి దగ్గర అడిగి పుచ్చుకొని చదువుకొనేవాడు. ఆ విన్న వాటినన్నిటినీ ఆ గుడి ముందు చేరే భిక్షగాళ్లకు, ఆడుకోవడానికి వచ్చే పిల్లలకు చెప్తూ ఉండేవాడు. అలా క్రమంగా అతనిలో జ్ఞానం పరిపూర్ణం కాసాగింది. ఆ జ్ఞానం వలన అతని ముఖంలో చక్కని కాంతీ, ప్రశాంతమైన ముద్రా చోటు చేసుకోసాగాయి.

నలభై ఏళ్లు గడిచిపోయాయి. ఆనాటి యువకులు వృద్ధులైపోయారు. పసిపాపలు యువకులయ్యారు. అన్నకు డెబ్బై ఏళ్లు వచ్చాయి. కాళ్లలో, కళ్లలో, చేతుల్లో శక్తి తగ్గింది. కానీ మనసులో ఎనలేని ప్రశాంతత, ముఖం

మీద నిశ్చలమైన ప్రసన్నత-అతన్ని చూడగానే గ్రామీణులందరి-పిన్నా పెద్దా, స్త్రీలూ, పురుషులూ అనే విచక్షణ లేకుండా అందరి-ముఖాలూ వికసిస్తాయి. చేతులు అప్రయత్నంగానే నమస్కరిస్తాయి. ఇప్పడు అన్నే దేవాలయంలో ప్రధాన బోధకుడు.

ఒకరోజు ఆ ఊరికొక క్రొత్త వ్యక్తి వచ్చాడు. అతన్ని అన్న ప్రవర్తన, ఆకృతీ చాలా ఆకర్షించాయి. దగ్గరగా వెళ్ళి నమస్కరించాడు. ఆయన బోధ విన్నారు. వింటూ అలా చూస్తోంటే అతనికెంతో సంతోషం కలిగింది. ఓ చిన్న సందేహం కూడా కలిగింది. అన్నను సూటిగా అడగలేక ఒక యువకుడి దగ్గరకు వెళ్లి యిలా అడిగాడు. "ఆ పెద్ద మనిషి ముఖం మీద ఎస్‌టి అని ఒక గుర్తున్నది- అదేమిటి?" అని. ఆ యువకుడు కాస్త ఆలోచించి యిలా చెప్పాడు. ''వారు చాలా మహిమ గలవారు-దయామూర్తి- పుణ్యాత్ముడు. ఎస్‌టి అంటే సెయింట్ అని అర్థం. వారి పవిత్రతకు అది గుర్తు".

చూచారా బాలలూ! పొరపాటున మనం కొన్ని దోషాలు చేసినప్పటికీ, స్థిరంగా నిలబడి, భగవంతుని మీద భారం వేసి మన ప్రవర్తన మార్చుకొని బాగుపడితే-క్రమంగా మన దోషం నశించి పోతుంది. పరమాత్ముడు మనకు మళ్లీ మంచి స్థితి కలిగిస్తాడు. చేసిన తప్పకు బాధపడటం (పశ్చాత్తాప పడటం) జరిగితే-బాబా ఆశీస్సు తప్పక లభిస్తుంది.

---

## "నశ్రేయో నియమం వినా"

**(32వ పేజీ తరువాయి)**

తెలియగనే దానిని మలిచి వైచితిని. ఆ సాయంకాలమునకు "శ్రీవారే ఇక జాగ్రత్తగా నుండమనియు, భోజనమునకు వెళ్ల వచ్చుననియు కబురు బంపిరి. గండము తప్పినంత పనియైనది నాకు. ఆనాటి నుండి నియమపాలన బద్ధుడనైతిని. "నశ్రేయో నియమం వినా"యని తరచు చెప్పచు నన్ను తీర్చిదిద్దిన యొజ్జ శ్రీ స్వాముల వారు.





# "నశ్రేయో నియమం వినా"

- శ్రీ మళయాళ చరణ సన్నిధి నుండి

గురుదేవుడొకప్పడు కోపగించినను మాకు కరుణామయుడే! మహానుభావులు కోపగించినను తక్షణమే ఉపకారమొనర్చుట సహజము, స్వానుభవము నొకదానిని సంగ్రహించి చెప్పెద.

ప్రతి దినము నాశ్రమమున సాయంకాలము ప్రార్థన గంట కొట్టినప్పటినుండి మఱల భోజనపు గంట కొట్టు వరకు నిశ్శబ్దముగా నుండి జపధ్యానములు జేసికొనుచుండవలయును. మనన సమయమున మౌనమూనుట ముఖ్యము.

ఒకనాడు ఆశ్రమమునకు ధ్యాన సమయమున గొందరు సాధువులు దూరము నుండి యేతెంచిరి. భారతీయ మందిరము ముంగట గూర్చొని వారితో మాట్లాడుచుంటిని. మా పలుకుల యులుకులు శ్రీవారి చెవిన పడినవి కాబోలు. కొంత తడవుకు నొకని, తోడుకొని నిష్ఠాశ్రమము నుండి మా యొద్దకు వచ్చి శ్రీవారు తీక్షణముగా "ఎవరదీ" యన్నారు. "మేము స్వామి!" యన్నారు వారు. నేనున్నానుగా వారి నడుమ! నన్నుద్దేశించి" అన్నము తినేవాడా!" ఆశ్రమమున నుండరాదు వెళ్లుమ"ని నిర్దేవించిరి. అంతే! ఇక అపీలు ఏమియు నుండదు. ప్రక్కవారు వెల వెలబోయిరి. వారాశ్రమ చిరపరిచితులే. ఆనాడు క్రొత్తగా వచ్చిరి.

నేనంత ఆ రాత్రి భారతీయ మందిరమునకు దూరముగా నున్న పాఠశాలపై నొక గదిలో గడిపితిని. మరు రోజు మధ్యాహ్నము మీరు వరకును పడిగాపులు పడి వర్తమానము వచ్చునేమోనని వేచియుంటిని. ఒక ప్రక్క లజ్జ, మరియొక ప్రక్క నేనింత కాలము నుండి యఱకాళ్ళకు నఱచేతులొగ్గి పరిచారము చేయుచుంటినేయను "అహం" ఏమూలనో తలయెత్తి పలవరింప నెలకొనియున్నదని **(మిగతా 31వ పేజీలో)**